# ఆరరీ

## ౧౧

మబ్బులు లేని ఆకాశంలో పున్నమి చంద్రుడు నిండుగా నవ్వుతున్నాడు. 'నీ అంతటివాడి ముందు మేమెంత' అన్న తీరులో బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాయి చుక్కలు. వెన్నెలు తమలోకి ఇంకుతూ ఉంటే కలుగుతున్న హాయికి ఆ కాంపౌండులోని వేపచేట్లూ, కొబ్బరిచేట్లూ ఆకుల్ని అందంగా ఊపుతున్నాయి. వెన్నెట్లో తడుస్తున్న మిద్దెలూ, మేడలూ, పరవశిస్తున్నాయి. అల్లంత దూరాన ఉన్న పోలీసు స్టేషన్‌లో కొట్టిన గంటల శబ్ద తరంగాలు ఒకదాని తరువాత ఒకటి వినవస్తున్నాయి.

అంత వరకూ మోగిన గంటల్ని లెక్కించాడు శ్రీహరి. పది గంట లయిందన్నమాట అనుకున్నాడు.

వేసవి కాలం ప్రారంభం కావడం వల్ల ఇంట్లో వాళ్ళంతా మంచాలు బయట వేసుకుని నిద్రపోతున్నారు. తను మాత్రమేనా ఇంకా నిద్రపోనిది?

ఎక్కడి నుంచో ఘంటసాల 'భగవద్గీత' లీలగా వినిపిస్తోంది. ఇంత అందమైన రాత్రిని చూసి ఉంటే తిలక్ మరో 'అమృతం కురిసిన రాత్రి' రాసే వాడేమో? శ్రీహరి మేలుకుని ఉండి కూడా వెన్నెల రాత్రి అందాన్ని కనీసంగానైనా గమనించలేక, పోతున్నాడంటే; అతనిలో భావుకత లేక కాదు, బయటి అందాన్ని మించేటంత సంతోషం అతన్ని ఆవహించి ఉందిమరి? ఆ రోజు తక్కిన రోజుల కన్నా ఎంతో గొప్ప రోజు.

తన జీవితానికి నిజమైన సాఫల్యం చేకూరిన రోజు. తన నిరాశానిస్పృహల మయమైన బ్రతుకులో ఆశారేఖలు ఉదయించిన రోజు. దాదాపు ఎనిమిదేళ్ళు నిరుద్యోగిగా గడిపి, తన కిక ఉద్యోగప్రాప్తి లేదేమో అని నిశ్చయించు కున్న సమయంలో ఉద్యోగం దొరకడానికి మించిన ఆనందం ఏముంటుం దతనికి? రేపే తను డ్యూటీలో చేరతాడు. చేరిన క్షణం నుంచి తను ప్రభుత్వోద్యోగి అన్న మాట. ఆ మాట అనుకుంటే మనసంతా ఎంత హాయో! ఆ హాయిలో ఆ రోజు జరిగిన సంఘటనల్ని మళ్ళీ జ్ఞాపకం చేసుకోవడం ఎంత తృప్తో శ్రీహరికి.

ఆ రోజు మధ్యాహ్నం శ్రీహరి ఇంటికొస్తూనే తన ఉద్యోగపు ఉత్తర్వులు చూపించాడు వాళ్ళ నాన్నకి. ఆయన ఆనందానికి మేర లేదు- "వెరీగుడ్ మైబోయ్! కంగ్రాచ్యులేషన్స్" అంటూ ఆయన తన రెండు చేతుల్లోకీ శ్రీహరి చేతిని తీసుకుని ఆప్యాయంగా నొక్కాడు. శ్రీహరి తల్లీ, చెల్లెలూ ఒకటే సంతోషపడిపోయారు.

"ఒరే హరీ, ఏం ఉద్దోగం వచ్చిందిరా నీకు" అంటూ వాళ్ళ నాన్నమ్మ అద్దాలు సవరించుకుంటూ వణుకుతున్న కంఠంతో అడిగింది.

"వార్డర్.... నాన్నమ్మా" జామ్మని చెప్పాడు శ్రీహరి.

"వాడరా? అదేం ఉద్దోగం?"

"వాడరు కాదు నాన్నమ్మా వార్డన్" అంటూ శ్రీహరి చెల్లి సరిదిద్దింది.

"నీ తలకాయ్ వార్డనట వార్డన్ - వార్డన్ హాస్టల్లో ఉంటాడు. నా ఉద్యోగం పేరు వార్డర్—వార్డర్ అంటే జైల్లో ఖైదీలకు తిండీ తిప్పలూ, మంచీ చెడ్డలు చూసే వాడన్నమాట" అంటూ ఓ పెద్ద పోజు పెట్టాడు శ్రీహరి.

"తిప్పలూ, చెడ్డలూ నువ్వేం చూడనక్కరలేదనుకుంటా ...." అని చెల్లాయి అంటూ ఉంటే శ్రీహరి నవ్వేశాడు.

ఇక సాయంత్రం తన మిత్రులకి ఈ విషయం చెప్పగానే ఎగిరి గంతేసి- "మరి పార్టీ ఎప్పుడోయ్? జీతం తీసుకోగానే ఇస్తావా? లేక అడ్వాన్స్‌గానే ఇస్తావా?" అని మిత్రులంతా కోరస్‌లో అడిగేస్తుంటే- "పార్టీయేగా దాందేముంది? జీతం రాగానే" అనేశాడు.

"అయితే అడ్వాన్సుగా కాఫీ పార్టీ ముందు" అంటూ దగ్గర్లోనే ఉన్న హోటల్లోకి లాక్కెళ్ళారు శ్రీహరిని.

రౌండు టేబుల్ సమావేశంలా కూచుంది మిత్రబృందం ఒక టేబుల్ చుట్టూ.

"మనవాడు అదృష్టవంతుడురా! కష్టం లేని ఉద్యోగం. రాతకోతల ఉద్యోగమైతే ఎలాగబ్బా? ఫైళ్ళు రాయాలి. తప్పు రాస్తే ఆఫీసర్ చేత చివాట్లు తినాలి అంటూ ఏడవాలి. జైల్లో ఏం పని ఉంటుంది. పైగా వీడికి సేవ చేయడానికి ఛాన్స్ ఎప్పుడొస్తుందా అని కాచుక్కూర్చుంటారు ఏరా? అబద్ధమంటావా? అడిగాడు సారథి.

"నోర్మూయవోయ్! వీడికి ఏమీతెలీని విషయాన్ని కూడా అరగంట లెక్చరిచ్చి నిజమేనని ఒప్పించేయగలడు. బి.యల్. కట్టెయ్యి వెధవా అంటే వినడు జడిగాడు" అంటూ శ్రీహరి చివాట్లు పెడుతూంటే ముసి ముసిగా నవ్వుతున్నాడు సారథి.

కాఫీ కప్పులు తెచ్చి అందరి ముందు ఉంచాడు సర్వరు.

ఒరే హరీ, నేను డ్యూటీ కెళ్ళేప్పుడు ఆఫీసు కెళ్ళొస్తానని ఇంట్లో చెబుతాను. మరి నువ్వెలా చెబుతావురా? అడిగాడు మోహన్.

"జైలు కెళ్ళొస్తానంటూ చెబుతా" అంటూ నాలిక్కరుచుకుని నవ్వేశాడు శ్రీహరి.

"పాపం హరిగాడు ఏం నేరం చేయకనే జెయిలు పాలయి పోయాడురా" అంటూ మోహన్ గేలి చేస్తుంటే మిత్రులందరూ నవ్వేశారు.

"సర్లేవోయ్! ముందు కాఫీలు తాగండి చల్లారిపోతాయ్!" అంటూ చిరుకోపం ప్రదర్శించాడు శ్రీహరి.

"తాగుతాం కానీ 'ముందు' కాఫీలు ఎప్పుడో చెప్పు మరి" అన్నాడు నవీన్.

"ఈ నవీన్‌గాడి కెప్పుడూ 'మందు' పిచ్చేరా! నా రికమండేషన్... చెల్లదు కాని, చెల్లేట్లయితే ఎక్సైజు డిపార్టుమెంటులో ఉద్యోగం వేయించి ఉందును." శ్రీహరి అలా అంటూ ఉంటే మిత్రబృందం నవ్వుల్లో మునిగి పోయింది.

ఇలా జ్ఞాపకాలు చేసుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు శ్రీహరి.

## 2

"నీ పేరు శ్రీహరా?" అంటూ ఓసారి ఎగాదిగా చూశాడు సబ్‌జైలు సూపరింటెండెంటు మార్కండేయరావు.

"ఎస్సార్" అన్నాడు బిగుసుకుపోయి, శ్రీహరి.

శ్రీహరి ఇచ్చిన జాయినింగ్ రిపోర్టును పరిశీలిస్తున్నాడు మార్కండేయరావు. అతనికి సూదులు విసిరే కళ్ళున్నాయి. సూది మొనలాంటి ముక్కు ఉంది. ఆ ముక్కు కింద కోరమీసాలున్నాయి. వాటి కింద దృఢమైన నల్లటి పెదవులున్నాయి. ఖాకీ రంగు సూటుకీ, నల్లటి శరీరపు రంగుకీ మంచి జత కుదిరినట్టు అనిపిస్తుంది.

"ఏం చదివావు?" అంటూ ముద్దాయిని అడిగినట్టు అడిగాడు మార్కండేయరావు.

"బి.ఏ. సార్!"

ఫకాలున నవ్వాడు మార్కండేయరావు. కనుబొమలు ఎగరేస్తూ- "బి.ఏ.?" అబ్బో చాలా చదివావే.... అసలు వార్డరు క్వాలిఫికేషను ఎంతో తెలుసా? ఓన్లీ ఎయిత్ స్టాండర్డు.... ఎనిమిదో తరగతి పాసయి ఉంటే చాలు" అన్నాడు.

"అవును సార్!"

"ఏమిటి అవును? నువ్వేదో బి.ఎ. చదివావని లెవెల్ మెయింటెయిన్ చేయకూడదు. అండర్‌స్టాండ్? ఇక్కడ చదువుతో పని ఉండదు. డ్యూటీతోనే పని."

"ఎస్సార్!" అన్నాడు. ముళ్ళమీద నిలుచున్నట్టు ఉందతనికి.

ఆ గదిలో కొద్ది దూరంలో ఓ టేబుల్ ముందు ఏవో ఫైల్సు రాస్తున్న క్లర్కు ఇదంతా విని నవ్వుతున్నాడు.

"అన్నిటికీ 'ఎస్సార్' అంటూ ఉంటే సరిపోతుందనుకోకు. ఇదిగో హెడ్ వార్డరూ! తక్కిన వార్డర్ల నిలా రమ్మనవయ్యా!" అంటూ చిన్న పాటి కేక పెట్టాడు మార్కండేయరావు.

నీలం, తెలుపుచారల టోపీలు ధరించి ఖాకీ దుస్తుల్లో ఉన్న ఇద్దరు వార్డర్లు వచ్చారు. వాళ్ళ వెనకాల హెడ్‌వార్డరు నీలంరంగు టర్బను ధరించి నిలబడి ఉన్నాడు. శ్రీహరిని వచ్చిన వార్డర్లకి పరిచయం చేశాడు సబ్ జైలు సూపరింటెండెంటు.

"ఇతన్ని తీసుకెళ్ళి జైలంతా చూపించండయ్యా" అని వార్డర్లకు ఆర్డర్లు వేశాడు.

డ్యూటీ వార్డరు రమణ హరిని వెంట పెట్టుకుని సెల్సు వద్దకు వెళ్ళాడు.

తనెప్పుడూ సినిమాలలో జైలు గదుల్ని చూడ్డమే కానీ, ప్రత్యక్షంగా ఈ రోజే చూస్తున్నాడు శ్రీహరి.

కటకటాల వెనకాల నుంచి ఖైదీలు తొంగిచూస్తున్నారు. కొంతమంది శ్రీహరి ఎవరో రమణని అడిగి తెలుసుకుంటున్నారు.

3

నెల రోజులు గడిచిపోయాయి- శ్రీహరి ఉద్యోగంలో చేరి. జైలు వాతావరణానికి దాదాపు అడ్జస్టయ్యాడు. ఇటు జైలు స్టాఫ్‌తోటి. అటు జైలు గార్డు డ్యూటీ చేస్తోన్న పోలీసు స్టాఫ్‌తోటి సరదాగా ఉండటానికి అలవాటు పడ్డాడు.

ఆ రోజు మధ్యాన్నపు ఎండ నిప్పులు చెరిగేస్తోంది. అప్పుడే తను రెండో షిఫ్టు డ్యూటీకి వచ్చాడు. వేసవి తాపానికి తాళలేక యూనిఫామ్స్‌ని గార్డు రూమ్‌లో దండెంమీద వేలాడదీసి హాయిగా లుంగీలతో జైలు వరండాలో చతికిలబడి ఉన్నారు నలుగురైదుగురు పోలీసులు. తక్కిన వాళ్ళు కబుర్లాడుకుంటున్నారు.

ఖాకీ బట్టల్లో - అందులోనూ కొత్తవాటిలో విపరీతమయిన ఉక్క-పోసేస్తోంది శ్రీహరికి. అన్నీ విప్పేసి లుంగీతో ఉండాలంటే భయం-ఏ క్షణంలోనైనా సూపరింటెండెంటు వస్తాడేమోనని.... కానిస్టేబుల్స్‌కి ఆ భయం ఉండదు. 'జైలు అధికారులు మాకేం సంబంధం?' అనేస్తారు. తన ఖాకీ బట్టల మీద ఆ క్షణంలో కొంచెం విసుగు కలిగింది శ్రీహరికి.

"ఏమయ్యా శ్రీహరీ! బి.ఏ. చదివావు కదా- ఏదైనా మంచి ఉద్యోగం చూసుకోక పోయావా? ఈ పనికిమాలిన వార్డరు జాబే దొరికిందా?" అంటూ పోలీసు జానయ్య పలకరించాడు- వెల్లకిలా పడుకుని గాలి కోసం దినపత్రికతో విసురుకుంటున్నాడు.

"ఏదో లెండి ఇదీ రాకపోయుంటే ఏమైపోయేవాణ్ణో! అయినా ఇప్పుడు చదువుకు తగ్గ ఉద్యోగాలు ఎక్కడొస్తున్నాయండీ?'' అన్నాడు శ్రీహరి.

"అదీ నిజమే ననుకో'' అంటూ జానయ్య వీపు దురద పెడితే లేచి గోడ కానుకుని రుద్దుకుని మళ్ళీ- "ఈ రోజు మీ సూపరింటెండెంటు వాళ్ళ ఫ్యామిలీ వస్తుందటగా, ఏ ఊరు నుంచీ? అడిగాడు జానయ్య.

"విజయనగరం నుంచి వస్తారట'' అని చెప్పేసి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు శ్రీహరి.

జానయ్యకు పొద్దు పోకపోతే ఇలా ఏదో ఒకటి అడుగుతూ ఉంటాడని శ్రీహరికి ఈ నెల రోజుల్లోని అనుభవం.

"శ్రీహరీ! శ్రీహరీ!'' అంటూ ఆత్రంగా వచ్చాడు హెడ్ వార్డరు.

"ఏం సార్!'' అంటూ వచ్చాడు శ్రీహరి.

"సూపర్నెంటు వాళ్ళ ఫ్యామిలీ వచ్చారు. నిన్ను ఇంటి దగ్గరకు రమ్మన్నాడోసారి వెళ్ళిరా" అన్నాడు హెడ్ వార్డరు.

"ఎందుకు సార్! ఇంకాసేపట్లో ఖైదీలను అన్ లాకప్ చేసి కిచెన్ యార్డులోకి వదలాలి కదా?''

'చెప్పింది చేయవయ్యా, అనవసరపు ప్రసంగాలు మాని" విసుగ్గా అన్నాడు. హెడ్ వార్డరు ఆ మాటలకు శ్రీహరి కొంచెం హర్టయ్యాడు.

కథా నిలయం
766
శ్రీకాకుళం

"అన్‌లాకప్ విషయం నేను చూసుకుంటానుగానీ, నువ్వు తొందరగా వెళ్ళు."

సూపర్నెంటు ఫ్యామిలీ వస్తే తన కేమిటి? తన కెందుకు చెబుతున్నాడు ఈ హెడ్‌వార్డరు? అని ఆలోచించుకుంటూ తలపై టోపీని సవరించుకుని సూపర్నెంటు ఇంటికి బయల్దేరాడు శ్రీహరి.

* * *

"సార్! సార్!" అంటూ బయటి తలుపు దగ్గర్నుంచి పిల్చాడు శ్రీహరి.

"ఎవరు కావాలండీ?" అంటూ ఓ గజగమన వచ్చింది. శ్రీహరి యూనిఫామ్ చూసి అర్థమయిందానిలా- "ఓహో! వార్డరా! మీ సూపర్నెంటు గారు ఎవరితోనో మాట్లాడాలని వెళ్ళారు. వెళ్తూ వెళ్తూ చెప్పే వెళ్ళారులే నువ్వు రాంగానే నెయ్యీ, శెనగనూనే, కందిపప్పూ, కిరోసినూ తెప్పించుకో మన్నారు. ఇదో రుక్మిణీ!" అంటూ ఇంట్లోకి మొహం తిప్పి కేకేసింది గజగమన.

"ఏం పిన్నీ?" అంటూ ఇరవయ్యేళ్ళ మందగమన. బరువుగా అడుగులు వేస్తూ వచ్చింది.

"వార్డరు వచ్చాడమ్మా, సరుకులు తేవడానికి.... సంచులూ, క్యాన్లూ ఇవ్వు" అని చెప్పేసి వెళ్ళిపోయింది.

మందగమన ఓసారి శ్రీహరి వంక విచిత్రంగా చూసి లోపలి కెళ్ళింది.

తనంటే ఎవరో తెలీని ఆవిడ మొదట బహువచన ప్రయోగం చేసి తన డ్రస్ చూడగానే ఏకవచన ప్రయోగంలోకి దిగడం అవమానంగా అనిపించింది శ్రీహరికి.

సంచుల్నీ, క్యానుల్నీ, వాటితో పాటు సరుకులకు సరిపడా డబ్బుని తెచ్చి ఇచ్చింది మందగమన. శ్రీహరి వాటిని తీసుకొని బయల్దేరబోతోంటే- "ఇదిగో.... నిన్నే. ఆ టోపీని ఇలా ఇవ్వు ఇక్కడే ఉంచుతా.... బజాల్లో నీ టోపీని చూస్తూ నిలబడిపోతారు జనం" అంది నవ్వాపుకుంటూ. తల తీసేసినంత ఫీలయ్యాడు. మారుమాట్లాడకుండా టోపీ ఇచ్చేసి బజారుకు బయల్దేరాడు శ్రీహరి.

ఛ, ఎంత సంస్కారం లేని మనుషులు! మనిషి చూస్తే చదువుకున్న దానిలా ఉంది. ఎంత అసహ్యంగా మాట్లాడుతోంది! ఎదుటి మనిషి బాధపడతాడేమోనన్న ఇంగితం కూడా లేదు. అసలు ఈ సూపర్నెంటు గాడికి బుద్ధి లేదు. వాడి ఇంటికి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తే ఒక పని మనిషిని పెట్టుకోవాలి. వాడిలాగే తనూ గవర్నమెంటు సర్వెంటే కదా? తనకు ఆఫీసరయితే జైలుకు సంబంధించిన పనులు చెప్పాలి. అంతేకాని, ఇంటి పనులు చేయడానికి, తనని ఉపయోగించుకుంటాడా? తనది బుద్ధి తక్కువ పని కాకపోతే వాళ్ళు పని చెప్పిన వెంటనే 'సారీ అండీ! మీ ఇంటి పనులు చేయడానికి కాదు నేను ఉద్యోగం చేస్తోంది' అనేసి వాళ్ళ మొహం మీదే సంచులూ, క్యానులూ కొట్టి ఉంటే సరిపోయేది. తనెంత చేత కానివాడు అయ్యాడు! ఎంత అసమర్థుడయ్యాడు! తన ఇంటి పక్కన ఉంటోన్న పి.డబ్ల్యు.డి. ఇంజనీయరు కింద ఉంటోన్న అటెండర్లు ఇంజనీయరు ఇంటి పనులు చేసి పెడుతూ ఉంటే ఎంత అసహ్యమేసేది! ఎన్ని సార్లో ఆ విషయం మిత్రులతో అన్నాడు కూడా- 'అంత అభిమానం చంపుకుని ఆ ఉద్యోగం చేయడం కంటే ఏ రిక్షా తొక్కో బతకవచ్చు' అని. మరి ఈ రోజు తను అభిమానవంతుడా? ఏమైనా సరే ఇక నుంచి తను సూపర్నెంటు ఇంటి పని చేయడు. ఊరి నుంచీ ఈ రోజే కదా వచ్చారు అని ఈ ఒక్క రోజు ఫ్రెండ్లీగా చేస్తాడు తను అని తనకు తనే సర్దిచెప్పుకున్నాడు శ్రీహరి.

4

ఉదయం ఆరు గంటలయింది. జైలు తాళం చెవులు చార్జిలోకి తీసుకుని డ్యూటీకి ఎక్కాడు శ్రీహరి.

"ఏంటయ్యా శ్రీహరీ! నిన్న సాయంత్రం సరుకులు చాలా మోసుకొచ్చావు, మీ సూపర్నెంటుకేనా?" అంటూ అడిగాడు కైలాసం- అప్పుడే సెంట్రీ డ్యూటీ ఎక్కడానికేమో ఖైదీలను లెక్క వేసుకుంటూ, అక్కడే స్టూలు మీద కూచుని ఉన్న శ్రీహరి నుద్దేశించి.

ఖైదీలు విన్నారేమోనని ఓసారి పక్కనున్న సెల్లువైపు చూశాడు. వాళ్ళేదో కబుర్లు చెప్పుకుంటూ ఉండటంతో పరవాలేదనుకుని "అవునండీ! పాపం కొత్తగా ఊరినుంచి వచ్చారు కదా.... అందుకనీ...." ఏదో తప్పు చేస్తూ దొరికిపోయినవాడిలా తగ్గు స్వరంతో అన్నాడు శ్రీహరి.

"ఆ మాత్రం ఆఫీసర్ల ఇంటి పనులు చేయాలి లేవయ్యా! మన ఆఫీసర్లకు మనం పని చేయకపోతే ఎవరు చేస్తారు చెప్పు? ఏం ఫరవాలేదు. నా పదిహేనేళ్ళ సర్వీసులో పదేళ్ళు అలా చేసినవాడినే. ఇప్పుడంటే కొత్త కానిస్టేబుల్స్ వచ్చారనుకో- నాకు ఆ బాధ తప్పించారు. నువ్వు రిక్రూట్‌వి- ఏ పని చెప్పినా అఫీసరుకు ఎదురు చెప్పకుండా చేయాలి మరి. 'చేయను' అని అన్నావనుకో ఇంకేముందీ....నీ సర్వీసు పుస్తకంలో ఒక్క రిమార్కు ఎర్ర ఇంకుతో రాశాడనుకో ఇక నీకు ప్రోబేషను పిరియడ్ డిక్లేరు కాదు." కైలాసం అలా చెప్పుకుపోతూ ఉంటే మౌనంగా చూస్తూ ఉండి పోయాడు శ్రీహరి.

* * *

మధ్యాహ్నం 12 గంటలకు డ్యూటీ అయిపోగానే మఫ్టీలో తయారయ్యాడు, శ్రీహరి- తన రూమ్ కెళ్ళడానికి.

"సూపర్నెంటు పిలుస్తున్నాడు హరీ!" అని డ్యూటీ వార్డరు చెబితే సూపర్నెంటు ఆఫీసు గదిలోకి అడుగుపెట్టాడు శ్రీహరి.

"నిన్న చాలా మంచి నెయ్యి తెచ్చావోయ్! సరుకులు కూడా అన్నీ మరిచిపోకుండా తెచ్చావుట. మా ఆవిడ నిన్ను ఒకటే మెచ్చుకుంటోంది" అన్నాడు సూపర్నెంటు.

పొంగిపోలేదు శ్రీహరి. తనకి ప్రశంసలు కావలసింది వాళ్ళ ఇంటి విషయంలో కాదు, డ్యూటీ విషయంలో.

"ఇంతకుమునుపు నేను పని చేసిన జైల్స్‌లో వార్డర్లు ఇలా సరుకులు తెచ్చి ఇచ్చేవారే కాని, అంతా దొంగనాయాళ్ళు, సరుకులన్నీ నాసిరకంవి తెచ్చి డబ్బులు మిగుల్చుకొనేవాళ్ళు. ఏమో అనుకున్నా సరుకులు తేవడంలో దిట్టవే. ఈ రోజు నుంచీ నీకీ డ్యూటీ వద్దులేవయ్యా, హాయిగా మా ఇంటి దగ్గరే ఉండి పనులు చూసుకో.... ఇదిగో హెడ్‌వార్డరూ!" అంటూ కేకవేశాడు సూపర్నెంటు.

"ఎస్ సార్" అంటూ వచ్చాడు హెడ్‌వార్డరు.

"ఇతనికి ఆర్డర్లీ డ్యూటీ వేయవయ్యా! జైలు డ్యూటీ చూడ్డానికి ఇంకా నలుగురు వార్డర్లున్నారుగా."

"ఎస్‌సార్!" అని ఓసారి శ్రీహరివేపు చూసి నవ్వి- "చాలా మంచి కుర్రాడు సార్, బి.ఏ. చదివినా గర్వం కించిత్తు కూడాలేదు. పైగా మనిషి చాలా మెత్తనివాడు" అన్నాడు- 'నీకూ ఇష్టమేనా' అన్నట్టు చూస్తూ.

శ్రీహరి కళ్ళు తిరిగాయి. ఇకనుంచి తను సూపరింటెండెంటు ఇంటి పనులు చేసే ఆర్డర్లీనా.... లోపలి నుంచి పొంగుకొస్తున్న బాధ గొంతులో అడ్డుపడి "ఎస్సార్!" అని అనలేక తల ఆడించాడు గంగిరెద్దులా. *

(ఆంధ్రప్రభ వీక్లీ 5-8-87)